
సాక్షి
జోగుళాంబ గద్వాల
బుధవారం, 29, మే, 2024



ముగియనున్న పదవీకాలం
జోగుళాంబదేవి ఆలయ పాలక మండలి పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది.
వివరాలు 8లో ▸



పక్కా భవనమేది?
గండేడ్‌కు కేజీబీవీ మంజూరైనా పక్కా భవన నిర్మాణానికి నోచుకోవడం లేదు.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.1/25.9

వాతావరణం
రోజులో ఎక్కువ భాగం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టిమ్ మిషన్లలో లోపం.. బస్సు సర్వీసులు ఆలస్యం

గద్వాల క్రైం: గద్వాల ఆర్టీసీ డిపో నుంచి మంగళవారం ఉదయం బస్సు సర్వీసులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. గద్వాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులు తీవ్ర నిరాశ చెందారు. ప్రయాణికులకు బస్సు టికెట్స్ ఇచ్చే టిమ్ మిషన్‌లలో సాంకేతిక సమస్యల కారణంగా సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. గమనించిన సిబ్బంది సాంకేతిక నిపుణుల సహాయంతో సమస్యను నివారించారు. గంటపాటు ప్రయాణికులు బస్టాండ్‌లోనే నిలిచిపోయారు.

అనుమతి లేకుండా శిక్షణ కార్యక్రమాలు

- అడ్డుకున్న పోలీసులు

గద్వాల రూరల్: జిల్లాలో ఎన్నికల కోడ్ కొనసాగుతున్న వేళ ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం నిబంధనలకు వ్యతిరేకమని సీఐ భీమ్‌కుమార్ అన్నారు. మంగళవారం గద్వాల మండలం అనంతపురం గ్రామంలో గత మూడు రోజుల నుంచి ప్రభుత్వ పాఠశాలలో 11మంది మహిళలు బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, మహిళలపై దాడులు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సమాచారం తెలుసుకున్న సీఐ భీమకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అనంతపురం గ్రామానికి చేరుకున్నారు. అక్కడ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళల వివరాలపై ఆరా తీశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందస్తు అనుమతులు తప్పనిసరి అని మరోసారి ఇలాంటివి జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పి పంపించారు. అయితే పోలీసులు పెద్ద ఎత్తున గ్రామంలోకి రావడంతో గ్రామస్తులు కొంత ఆందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థంకాక గందరగోళానికి గురయ్యారు. దీనిపై ఎస్పీ రితిరాజ్‌ను సంప్రదించగా వచ్చిన వారు మావోయిస్టులు, నక్సల్స్ కాదని మహిళా సంఘాలకు చెందిన సభ్యులని చెప్పారు. ఎన్నికల కోడ్ కొనసాగుతున్నప్పుడు ముందస్తు అనుమతులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని అదే విషయాన్ని వారికి చెప్పి పంపినట్లు ఎవరిని కూడ అదుపులోకి తీసుకోలేదని వట్టి ప్రచారం మాత్రమేనని తెలిపారు.

వేరుశనగ క్వింటా రూ.6066



గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు మంగళవారం 77 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ. 6066, కనిష్ఠం రూ. 4321, సరాసరి రూ. 5001 ధరలు పలికాయి. అలాగే, 166 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్ఠం రూ. 2529, కనిష్ఠం రూ. 1769, సరాసరి ధర రూ. 1919 ధరలు వచ్చాయి.

సమస్యల సాధనే లక్ష్యంగా పోరాటం



పాన్‌గల్: ప్రతి కార్యకర్త ప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేస్తూ సమస్యల సాధనే లక్ష్యంగా పోరాటాలు కొనసాగించాలని సీపీఎం ఉమ్మడి రాష్ట్ర నాయకుడు మీర్యం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని రేమద్దులలో నిర్వహించిన పార్టీ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం మంగళవారం జరగగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి పేదల పక్షాన నిలిచిన చరిత్ర సీపీఎంకు ఉందని గుర్తు చేశారు. భూస్వాముల నుంచి 10 లక్షల ఎకరాల భూమికి విముక్తి కలిగించి పేదలకు పంచిన ఘనత పార్టీకి ఉందని తెలిపారు. పేదలు, రైతులు, కూలీలు, కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్నది ఎర్రజెండా పార్టీ అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు వంత పాడుతోందని.. కనీస అవసరాలకు నోచుకోని స్థితిలో పేదలు ఉన్నారని తెలిపారు. పేదల కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం ప్రభుత్వాలు కల్పించాలన్నారు. రెండ్రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతుల్లో 'పార్టీ నిర్మాణం.. ప్రజాసంఘాల బాధ్యత' అనే అంశంపై పార్టీ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్, మండల నాయకులు వెంకటయ్య, భాస్కర్, నిరంజన్, కోదండరాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తాయి రైతు విలవిల

వాతావరణ పరిస్థితులతో తగ్గిన దిగుబడి



గట్టు శివారులో బత్తాయి పండ్లను తెంపి రాశులుగా పోస్తున్న కూలీలు

- మార్కెట్‌లో పడిపోయిన ధరలతో ఆందోళన
- గతంలో టన్నుకు రూ.30వేల నుంచి రూ.40వేలు పలికిన వైనం
- ఈసారి రూ.20వేల నుంచి రూ.25వేల వరకు మాత్రమే వస్తోందని ఆవేదన
- జిల్లాలో 7వేల ఎకరాల్లో తోటల సాగు

గద్వాల వ్యవసాయం: వాతావరణం అనుకూలించకపోవడం.. అటు దిగుబడులు తగ్గడం.. సరైన సమయంలో మార్కెట్‌లో ధరలు నేలచూపులు చూస్తుండడం.. మొత్తంగా బత్తాయి తోటల రైతులను ఈ ఏడాది కష్టాలు వెంటాడుతున్నాయి. తోటలకు రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టి, పంట సరిగ్గా చేతికి రాక అదేసమయంలో మార్కెట్‌లో ధరలు రాక రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో జంబేరి, రంగాపూర్ రకాలు సాగు..

పండ్లతోటలకు నడిగడ్డలో నేలలు అనుకూలంగా ఉన్నాయి. ఇందుకు కావాల్సిన ఎర్ర నేలలు ఎక్కువగా ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు కూడా సాధారణంగా బాగుంటాయి. ఇక్కడి రైతులు గడిచిన పదిహేను ఏళ్లనుంచి బోర్లు, బావుల కింద పండ్లతోటలు బాగా సాగు చేస్తున్నారు. ఈక్రమంలో జిల్లాలో 7వేల ఎకరాల్లో బత్తాయి తోటలు వేశారు. జంబేరీ, రంగాపూర్ వెరైటీ సాగు చేశారు. ఈతోటలకు ఎకరాకు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చు అవుతుంది. ఏటా రెండు సార్లు కాపు వస్తుంది. ఏప్రిల్, మే నెలలో ఒకసారి, సెప్టెంబర్, అక్టోబర్‌లో రెండో సారి కాపు వస్తుంది.

జిల్లా వివరాలిలా..

మండలం	బత్తాయి తోటలు (ఎకరాల్లో)
మల్దకల్	2,550
ధరూర్	1,500
గద్వాల	1,200
అయిజ	600
గట్టు	500
కేటీదొడ్డి	400
ఇటిక్యాల	220
వడ్డేపల్లి	30

అనుకూలించని వాతావరణం

గడిచిన ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. జూన్‌లో వర్షాలు రాలేదు. జులైలో ఓ మోస్తారుగా వర్షాలు కురిసాయి. ఆ తర్వాత వర్షాల జాడే లేకుండా పోయింది. దీని ఫలితంగా భూగర్భ జలాల నీటి మట్టాలు గణనీయంగా పడిపోయాయి. ఈపరిస్థితులు బత్తాయి తోటలపై ప్రభావాన్ని చూపాయి. సరిగ్గా పూత పూసే సమయంలో భూమిలో తేమశాతం తగ్గింది. ఉష్ణోగ్రతలు ఎక్కువ అయ్యాయి. వీటితో పాటు బోర్లలో నీటి మట్టాలు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా జిల్లాలో చాలా ప్రాంతాల్లో బత్తాయి దిగుబడులు తగ్గాయి. కాయ సైజు రావాల్సినంత రాలేదు. పై నుంచి పూత రావడానికి, కాయ బాగా రావడానికి వేలకు వేలు మందులకు ఖర్చు చేశారు. అయినప్పటికి బత్తాయి రైతులకు నిరాశే మిగిలింది. ఎకరాకు 8 నుంచి 10 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా, చాలచోట్ల 4నుంచి 6 టన్నులు మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదనతో చెబుతున్నారు. ఇక ధరల విషయానికి వస్తే టన్నుకు కనీసం రూ.30వేల నుంచి రూ.40వేల వరకు వస్తేనే గిట్టుబాటు అవుతుంది. అయితే కాయసైజు చిన్నగా ఉండటం వల్ల మార్కెట్‌లో రూ.20వేల నుంచి రూ.25వేల వరకు మాత్రమే వస్తోందని వాపోతున్నారు. ఈసారి పెట్టుబడులు ఎక్కువగా పెట్టామని, ఈసారి దిగుబడులు తగ్గాయి అదేవిధంగా ధరలు కూడా తక్కువగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ పరిస్థితులు మంచిగా అనుకూలిస్తే ఎకరాకు 8నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. అయితే మిగిలిన పండ్ల తోటలతో పోల్చితే బత్తాయి తోటలకు పెట్టుబడులు ఎక్కువే. అదే సమయంలో నిర్వహణ కూడా ఎక్కువే. కాగా ఇక్కడి రైతులు ఎక్కువగా బెంగళూర్, హైదరాబాద్, ఢిల్లీకి విక్రయిస్తుంటారు.

ధరలు రావడంలేదు



ఐదు ఎకరాల బత్తాయి తోట ఉంది. ఈసారి పురుగుల మందులు, ఎరువులకు బాగా ఖర్చు అయ్యింది. నీటి తడులు తక్కువ కావడం వల్ల దిగుబడి తగ్గింది. కాయ సైజు తక్కువగా ఉండటం వల్ల మార్కెట్‌లో ధరలు రావడం లేదు. మొత్తం మీద ఈసారి నష్టమే.

– కుర్వబొజ్జన్న, బత్తాయి తోట రైతు, గట్టు

వాతావరణ ప్రభావం



గడిచిన ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. దీనివల్ల చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గాయి. అటు వర్షాలు లేక ఇటు వాతావరణ అనుకూలించక బత్తాయి తోటలపై ప్రభావాన్ని చూపింది. అయితే నీటి వనరులు బాగా ఉన్న కొన్ని చోట్ల దిగుబడులు బాగానే వచ్చాయి. సైజు మంచిగా వచ్చిన రైతులకు ధరలు కూడా గిట్టుబాటుగా వస్తున్నాయి.

– ఎంఏ అక్బర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

పకడ్బందీగా కౌంటింగ్ ప్రక్రియ



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ బిఎం సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన జిల్లా ఎన్నికల కౌంటింగ్ అధికారులతో మాట్లాడారు. జూన్ 4వ తేదీన ఉదయం 8గంటలకు మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ సకాలంలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా కౌంటింగ్ నిర్వహించే విధంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అదేవిధంగా కౌంటింగ్ హాలులోకి ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద ఫలితాలు ప్రకటించేందుకు ప్రత్యేకంగా మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరౌండ్ ఫలితాలను ప్రకటించేందుకు జిల్లా సీనియర్ అధికారిని మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

తప్పులకు తావివ్వొద్దు

జూన్4వ తేదీన జరిగే కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కౌంటింగ్ సిబ్బంది, అధికారులు సకాలంలో చేరుకునేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మొదలవుతుందన్నారు. అనంతరం 8:30గంటలకు ఈవీఎం కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. ప్రతిరౌండ్‌కు రిజల్ట్‌ను షీట్‌లో పొందుపర్చి ఇవ్వాలన్నారు. గద్వాల సెగ్మెంట్ పరిధిలో 16టేబుల్స్, అలంపూరు సెగ్మెంట్ పరిధిలో 14టేబుల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్, డీఆర్డీవో నర్సింగ్‌రావు, తిమ్మారెడ్డి, ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'భారత్‌మాల' భూసేకరణపై విచారణ



గట్టులో విచారణ నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

గట్టు: భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అదనంగా మరికొంత మేరకు భూమిని సేకరించే నిమిత్తం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సమక్షంలో విచారణ నిర్వహించారు. మంగళవారం గట్టు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో రైతుల భూములను ఇది వరకే సేకరించి, పరిహారం అందజేశారు. మరికొంత భూమి అవసరం మేరకు గట్టు, రాయాపురం, తప్పెట్లమొర్సు గ్రామాల పరిధిలోని మొత్తం 15 ఎకరాలకుగాను 87 మంది రైతులకు అధికారులు ఇది వరకే నోటీసులను జారీ అందజేశారు. సదరు రైతులు గట్టు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని, అదనపు భూ సేకరణకు సంబంధించిన ఒరిజినల్ పట్టాదారు పాసుపుస్తకం, ఇతర పత్రాలను అదనపు కలెక్టర్‌కు చూపించారు. రికార్డులతో పాటుగా, భూ యజమానులు వీరే అన్నట్లుగా రెవెన్యూ రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. అవార్డు విచారణ పూర్తి చేసిన తర్వాత రైతులకు నష్టపరిహారం చెల్లించనున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరితారాణి, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సినియర్ అసిస్టెంట్ తిరుమలేష్, ఆర్‌ఐ రాజు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు



అడ్వకేట్ జనరల్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు



జోగుళాంబ ఆలయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ దర్శించుకున్నారు. అదే విధంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజినీరింగ్ అధికారులు జి.కే ద్వివేది, వి.నాగమల్లేశ్వర్ రావు, యూబీఎస్ఎం స్వామి, నీలపావని, కశ్యప్ దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి బాల బ్రహ్మేశ్వర స్వామివారికి ఏకవారరుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి ఖడ్గమాల, త్రిశతి అర్చనలు చేశారు. తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. అదే విధంగా మహారాష్ట్రలోని కొల్హాపూర్ గురుసిద్దేశ్వర శివాచార్య స్వామిజీ కూడా దర్శించుకున్నారు.

డిగ్రీ పరీక్షల్లో18 మంది డిబార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలు కొనసాగుతుండగా.. మంగళవారం ఒక్కరోజే 18 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయ్యారు. ఉదయం సెషన్‌లో సెమిస్టర్ 2కు సంబంధించి మొత్తం 12,882 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 12,024 మంది హాజరయ్యారు. 846 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నంసెషన్‌లో 6వ సెమిస్టర్‌లో 8,415 మంది విద్యార్థులకు 8,085 మంది విద్యార్థులు హాజరయ్యారు. 324 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సెమిస్టర్–2లో 12 మంది మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్, జడ్చర్ల, కొండనాగుల పరీక్ష కేంద్రాల్లో డిబార్ కాగా... మధ్యాహ్నం జరిగిన సరీక్షలో ఆరుగురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ చిక్కారు. ఇందులో ఒక్క ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఎనిమిది మంది విద్యార్థులుడిబార్ అయినట్లు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

సురవరం ప్రతాపరెడ్డి సేవలు మరువలేనివి

గద్వాల అర్బన్: తెలుగుజాతికి సురవరం ప్రతాపరెడ్డి చేసిన సేవలు మరువలేనివని రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట రాజారెడ్డి అన్నారు. సురవరం ప్రతాప రెడ్డి 128వ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట రాజారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి నాయకులు రంగారెడ్డి, వెంకట్ రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్డి సేవా సమితి నాయకులు

చిన్నపాటి నిర్లక్ష్యం.. భారీ మూల్యం

బస్సు, బైక్ ఢీకొని.. ముగ్గురు యువకుల దుర్మరణం

- ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడం, అతివేగమే ప్రమాదానికి కారణం
- నారాయణపేట జిల్లా మక్తల్‌లో విషాదం నింపిన ఘటన
- శోకసంద్రంలో కుటుంబాలు.. పరామర్శించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ప్రతిరోజు వారు కలిసి తిరుగుతూ.. కష్టసుఖాలను పంచుకునేవారు.. శుభకార్యాల్లో ఫొటోలు, వీడియోలు తీస్తూ జీవనం సాగించారు.. జీవితకాలం ఇలాగే సాఫీగా సాగిపోతుందనుకున్న తరుణంలో.. చిన్నపాటి నిర్లక్ష్యం వారి పాలిట శాపంగా మారి.. కాటికి సాగనంపింది.. నిబంధనలను బేఖాతర్ చేస్తూ.. హెల్మెట్ లేకుండా ముగ్గురు కలిసి ఒకే బైక్‌పై అతివేగంగా వెళ్లి.. ఎదురుగా వచ్చిన బస్సును అదుపు తప్పి ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం మక్తల్ పట్టణంలో విషాదం నింపింది. హెల్మెట్ లేకపోవడం, మితిమీరిన వేగంతో వాహనం నడపడం వల్ల ఎంతటి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందో ఈ సంఘటన మరోసారి నిరూపించింది.

– మక్తల్

నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ శివారులోని ఎల్లమ్మకుంటకు చెందిన ఫొటోగ్రాఫర్ రాఘవేంద్రచారి (30), వెంకటేష్(29), మహేష్‌కుమార్(21) వీడియో గ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో మక్తల్ మండలంలోని కాచ్‌వార్ గ్రామంలో ఓ ఇంట్లో శుభకార్యంలో ఫొటోలు తీసేందుకు మంగళవారం ఉదయం వెళ్లారు. తర్వాత కొద్దిసేపు విరామం దొరకడంతో మక్తల్‌కు వచ్చి.. తిరిగి మధ్యాహ్నం సమయంలో ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై మళ్లీ బయలుదేరారు. ఈ క్రమంలో మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని దండు గ్రామం సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారి–167పై మహబూబ్‌నగర్ నుంచి రాయచూర్ వెళ్తున్న కర్ణాటక బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటేష్, రాఘవేంద్రచారి అక్కడికక్కడే మృతిచెందగా.. మహేష్ కాలు విరిగి తలకు తీవ్రగాయాలు కావడంతో 108లో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు.



సంఘటన స్థలంలో మృతదేహం.. (ఇన్‌సెట్‌లో) ప్రమాదానికి కారణమైన బస్సు

అందరూ నిరుపేదలే..



రాఘవేంద్రచారి (ఫైల్)



వెంకటేష్ (ఫైల్)



మహేష్‌కుమార్ (ఫైల్)

రాఘవేంద్రచారి మక్తల్‌లో భవాని ఫొటోస్టూడియో పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈయన తండ్రి శ్రీనివాస్‌చారి అనారోగ్యంతో బాధపడుతుండగా.. తల్లి సత్యమ్మ గతంలోనే మృతిచెందింది. దీంతో రాఘవేంద్రచారికి భార్య చందన, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అలాగే వీడి యోగ్రాఫర్ వెంకటేష్ తల్లిదండ్రులు చిన్నప్పుడే మృతి చెందగా సోదరుడు రాములుతో కలిసి ఉంటున్నాడు. మక్తల్ మండలంలోని పంచలింగాలకు మహేష్ మక్తల్‌లో ఐటీఐ చదువుతున్నాడు. మహేష్ తల్లిదండ్రులు బుచ్చన్న, లలితమ్మ పదేళ్ల క్రితమే మక్తల్‌కు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మహేష్ వీడియోగ్రాఫర్ నేర్చుకోవాలని ఇష్టంతో వారితో కలిసి తిరుగుతున్నాడు. బుచ్చమ్మ, లలితమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా ఇద్దరు కూతుళ్లు, కుమారుడు మహేష్ ఉన్నారు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గుండెలవిసేలా రోదించారు.

మిన్నంటిన రోదనలు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాఘవేంద్రచారి, వెంకటేష్, మహేష్ పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ సమాచారం అందుకున్న మృతుల కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు తరలిరావడంతో ఆస్పత్రి ప్రాంగణమంతా కిటకిటలాడింది. వారి రోదనలతో ఆస్పత్రి పరిసర ప్రాంతాలు హృదయ విదారకంగా మారాయి.

పరామర్శించిన ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందిన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఎమ్మెల్యేను చూసి మృతుల తల్లిదండ్రులు కాళ్లమీద పడి బోరున విలపించారు. దీంతో ఎమ్మెల్యే వారిని పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. ఆస్పత్రిలోనే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు. ప్రమాదానికి అతివేగమే ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

ఉప్పునుంతల: మండలంలోని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో ఫిరట్వానిపల్లి స్టేజీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. దీంతో ఈ ఘటనకు సంబంధించి బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. జడ్చర్ల మండలం నక్కలబండ తండాకు చెందిన కేతావత్ శంకర్ బాబాయి కుమారుడు కేతావత్ రవికుమార్, అతని స్నేహితుడు, కారు డ్రైవర్ లావుడ్య శ్రీనివాస్‌లు కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరిగుట్ట, శ్రీశైలం వెళ్తున్నారు. వారితో పాటు శంకర్ కుమారుడు శ్రీరాం చైతన్య (15)ను వెంట తీసుకెళ్లారు. లావుడ్య శ్రీనివాస్ అజాగ్రత్తగా కారు నడపడంతో రోడ్డు ప్రమాదం సంభవించి శ్రీరాం చైతన్య మృతి చెందాడు. ఈ ప్రమాదానికి అజాగ్రత్తగా కారు నడపడమేనని శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి జనరల్ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి సమాచారం మేరకు.. మండలంలోని బొందలపల్లికి చెందిన మాసయ్య (56) రెండేళ్లుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం మరోసారి కడుపునొప్పి రావడంతో తాళలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు మాసయ్యను చికిత్సనిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మాసయ్య కుమారుడు పర్వతాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాయాదుల గొడవలో వ్యక్తి..

అడ్డాకుల: దాయాదుల గొడవలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని రాచాలకు చెందిన ఆంజనేయులు (47)కు ఏళ్ల కిందట వారసత్వంగా ఉద్యోగం వచ్చింది. ఇదే విషయమై దాయాది కొండన్న కుటుంబసభ్యులు ఆంజనేయులుతో ఈ నెల 22న ఇంటి వద్ద గొడవపడ్డారు. ఈ క్రమంలో కొండన్న, ఆయన భార్య లక్ష్మమ్మ దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోనే రాజీ చేయాలని కొందరు ప్రయత్నాలు చేశారు. ఇంతలో ఆంజనేయులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆదివారం జిల్లాకేంద్రానికి.. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. భార్య కృష్ణమ్మ ఫిర్యాదు మేరకు కొండన్న దంపతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని అమడబాకుల గ్రామ శివారులోని పులిగుట్టపై ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డెవాటకు చెందిన అంజలి(36)కి కొన్నేళ్ల కిందట రాయిణిపేటకి చెందిన రాములుతో వివాహమైంది. వీరికి కుమార్తె ఉంది. భార్యాభర్తల గొడవ కారణంగా కొన్నేళ్ల కిందటి నుంచి అంజలి భర్త నుంచి దూరంగా ఉంటోంది. ప్రస్తుతం తల్లితో కలిసి కొత్తకోటలో నివాసం ఉంటుంది. సోమవారం ఇంట్లో నుంచి వెళ్లిన అంజలి అమడబాకుల గ్రామ శివారులోని పులిగుట్టపై చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం అటుగా వెళ్లిన కొందరు ఉరి వేసుకుని కనిపించిన మహిళను చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి మార్చురీకి తరలించారు. మృతురాలి అన్న బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

చిరుత కలకలం

గండేడ్: మండలంలోని ఆశిరెడ్డిపల్లి శివారులో మంగళవారం ఉదయం చిరుత కనిపించడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ శివారులోని కోర్లాళ్ల గుట్ట పైనుంచి కిందకు వస్తున్న చిరుతను అక్కడే ఉన్న చెవుల వెంకటయ్య చూసి వెంటనే సమీప పొలాల రైతులు, గ్రామస్తులకు సమాచారమిచ్చారు. దీంతో అప్రమత్తమైన కాపరులు అక్కడి నుంచి మేకలు తీసుకొని వెళ్లిపోయారు. నాలుగైదు రోజులుగా కొండాపూర్, రంగారెడ్డిపల్లి, లింగాయపల్లి శివారుల్లో చిరుత సంచరిస్తూ మేకలను చంపి తినేస్తుంది. తాజాగా ఆశిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో కనిపించింది.

సమాంతర కాల్వ ద్వారా 27 క్యూసెక్కులు విడుదల

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. బుధవారం 1,012 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నిలిపివేసారు. సమాంతర కాల్వ ద్వారా 27 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

ముగియనున్న పదవీకాలం



ఆలయ పాలకమండలి

- జోగుళాంబ ఆలయ ఛైర్మన్ పదవి కోసం ఆశావహుల ప్రయత్నాలు

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు ధర్మకర్తల మండలి పదవీ కాలం ఈ నెల 31తో ముగియనుంది. ఏడాది పదవీకాలంలో తమకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆలయ కమిటీ ఛైర్మన్ చిన్నకృష్ణయ్య అన్నారు. గత పాలక మండలిలో సభ్యుడిగా పనిచేసిన అనుభవంతో ప్రస్తుత పాలకమండలికి ఛైర్మన్‌గా సేవలందించడంలో సఫలీకృతం అయినట్టు తెలిపారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి ఆర్కియాలజికల్ నిబంధనలు అడుగడుగున అడ్డు తగులుతున్నప్పటికీ సంబంధిత శాఖ వారిని పలుమార్లు కలిసి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల నిమిత్తం వినతులు ఇచ్చామన్నారు. దాతల సహకారంతో బూడిదపాడు, బైరాపురం చౌరస్తాల వద్ద శాశ్వతంగా నిలిచిపోయే శివుడు, నంది విగ్రహాలు ఏర్పాటు చేయించినట్టు తెలిపారు. అలాగే ఆలయంలో ప్రతి ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు, హంసవాహనం, నందివాహనం, గజవాహనం, సింహవాహనం వంటి పలు వాహనాలను కూడా దాతల సహకారంతో చేయించారు. చౌరస్తా నుంచి అలంపూర్ వరకు రెండు ఆర్చిగేట్లు అలాగే కల్యాణ మండపం నిర్మాణం కోసం దేవాదాయ శాఖ నుంచి అనుమతులు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో ఆ పనులకు శంకుస్థాపన చేయలేక పోయామన్నారు.

ఎదురుచూస్తున్న ఆశావహులు

ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జోగుళాంబ ఆలయ పాలక మండలిపై కాంగ్రెస్ నాయకులు పలు ఆశలు పెట్టుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్‌గా ఇప్పటికే వడ్డేపల్లి మండలానికి చెందిన ఓ సీనియర్ పేరు బలంగా వినిపిస్తున్నప్పటికీ అద్భుతాలు చోటుచేసుకునే అవకాశాలు కూడా మెండుగా కనిపిస్తున్నాయి. కాగా ప్రస్తుత పాలకమండలి కూడా మరొక్క చాన్స్ ప్లీజ్ అంటూ మరోమారు పాలక పగ్గాలు పట్టేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఇందు కోసం నియోజకవర్గంలోని ఇద్దరు ప్రముఖుల రికమండేషన్ లెటర్‌తో ఇటీవల కమిషనర్‌ను కలిసినట్టు విశ్వసనీయ సమాచారం. ఛైర్మన్ పదవి ఈ సారి ఎవరిని వరిస్తుందో చూడాలి మరి.

ఆలయానికి పూర్తి సమయం కేటాయించా..



ఒక్క సారి ధర్మకర్తగా, మరో మారు ఛైర్మన్‌గా నాకు అవకాశం వచ్చింది. ఈ రెండు పర్యాయాలు పూర్తిగా ఆలయానికి సమయాన్ని కేటాయించాను. సమావేశాలు ఏర్పాటు చేసి అనేక తీర్మానాలు చేశాం. కానీ చాలా తీర్మానాలు ఎందుకు అమలు కాలేదో అర్థం కాలేదు. చేసిన తీర్మాలన్ని అమలైతే భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేది.

– చిన్న కృష్ణయ్య, ఆలయ ఛైర్మన్

చాలా సంతృప్తి ఇచ్చింది



ఆలయంలో ప్రతి ఉత్సవాలకు, ప్రత్యేక రోజుల్లో జరిగే కార్యక్రమాలకు మరియు చండీహోమాలకు క్రమం తప్పకుండా హాజరయ్యాను. మా హయాంలో మహా కుంబాభిషేకం జరిపించడం చాలా ఆనందంగా ఉంది. అర్చకులు, సిబ్బంది అందరు పాలకమండలికి సహకరించారు.

– వెంకటేశ్వర్ రెడ్డి, ధర్మకర్త

తప్పిదాలు జరగకుండా చూశాం..



పాలక మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఆలయంలో పలు చోట్ల తప్పిదాలు జరుగుతున్నాయని విన్నాను. ఆలయంలో ఎక్కడ కూడా తప్పిదాలు జరగకుండా చూశాం. హుండీ లెక్కింపుల్లో, ఆదాయ వ్యయాల్లో కానీ, భూముల వేలం, వెండి బంగారు ఆభరణాల విషయంలో కూడా గమనించేవాళ్లం.

– సి.వెంకటేష్, ధర్మకర్త

కందూరు కోసం వచ్చి.. కాటికి

బావిలో కాళ్లు కడుక్కోవడానికి వెళ్లి ఇద్దరు చిన్నారుల మృతి

- ఈత రావడంతో బయటపడిన మరో బాలుడు
- నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో ఘటన



మహమ్మద్, ఫుర్కాన్ మృతదేహాలు



మహమ్మద్, ఫుర్కాన్ (ఫైల్)

బిజినేపల్లి/జడ్చర్ల: కందూరు చేసి మొక్కు తీర్చుకోవాలని కుటుంబంతో కలిసి వచ్చారు. ఈ క్రమంలో ముగ్గురు బాలురు సమీపంలో ఉన్న బావిలో కాళ్లు కడుక్కోడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి ఇద్దరు బాలురు మృతి చెందగా.. కొద్దిమేర ఈత వచ్చిన మరో బాలుడు త్రుటిలో తప్పించుకున్నాడు. ఈ విషాదకర సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బిజినేపల్లికి చెందిన మతీన్ అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం జడ్చర్లకు వెళ్లి స్థిరపడ్డాడు. ఈ క్రమంలో స్వగ్రామంలో కందూరు చేయాలని భావించిన మతీన్ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి మంగళవారం బిజినేపల్లిలోని దర్గా వద్దకు వచ్చారు. అయితే దర్గాకు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో కాళ్లు కడుక్కోవడానికి మతీన్ కుమారుడు ఫుర్కాన్(10), బంధువు అజ్మత్ కుమారుడు మహమ్మద్(12), మరో బాలుడు అక్మల్ కలిసి వెళ్లారు. ఈ క్రమంలో వారు ప్రమాదశావత్తు బావిలో జారిపడ్డారు. దర్గాకు పాతాళ్లు ఇస్తున్న కుటుంబ సభ్యులు విషయం గమనించి వారిని రక్షించే ప్రయత్నం చేయగా.. అప్పటికే ఫుర్కన్, మహమ్మద్ నీటిలో మునిగిపోయారు. అక్మల్‌కు ఈత రావడంతో ఒడ్డుకు చేరుకున్నాడు. అనంతరం స్థానికులు అక్కడికి చేరుకుని బావిలో నుంచి ఇద్దరు బాలుర మృతదేహాలను బయటికి తీశారు. విగతజీవులుగా మారిన చిన్నారులను చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు.

జడ్చర్లలో విషాదఛాయలు

జడ్చర్లలోని విద్యానగర్‌కాలనీలో నివాసం ఉంటున్న బీఆర్‌ఎస్ నాయకులు మతీన్, అజ్మత్‌ల కుమారులు మహమ్మద్, ఫుర్కాన్ బావిలో ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. మతీన్‌కు ఫుర్కాన్‌తోపాటు మరో ఇద్దరు పిల్లలు ఉండగా.. అజ్మత్‌కు మహమ్మద్ తోపాటు ఒక కూతురు ఉంది.

తెలుగు సాహిత్యంలో అగ్రగణ్యుడు సురవరం



సురవరం ప్రతాపరెడ్డి గ్రంథావిష్కరణ చేస్తున్న చిన్నారెడ్డి, కవులు తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలుగు సాహిత్యంలో అగ్రగణ్యుడు సురవరం ప్రతాపరెడ్డి అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం పాలమూరు సాహితీ ఆధ్వర్యంలో తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని కాళోజీ హాల్‌లో జరిగిన గ్రంథావిష్కరణ కార్యక్రమానికి చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంతో విలువైన సాహిత్యాన్ని సమాజానికి అందించిన గొప్ప వ్యక్తి అని కీర్తించారు. మొదటి సార్వత్రిక ఎన్నికల్లో వనపర్తి జిల్లా నుంచి మొదటి శాసనసభ్యుడిగా ఎన్నికై న సురవరం పరిశోధనా రంగంలో విశేష కృషి చేశారన్నారు. ఆంధ్రుల సాంఘీక చరిత్ర ఆయనకు గొప్ప పేరును తీసుకువచ్చిందన్నారు. సురవరం పరిశోధన నేటి తరానికి అత్యంత ఆవశ్యకమన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణమ్మ మాట్లాడుతూ సురవరం సాహిత్యాన్ని అందరూ చదవాలని సూచించారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ సురవరం ఒకపక్క పరిశోధన రంగంలో కృషి చేస్తూనే మరో పక్క సృజనాత్మక రంగంలో అపూర్వమైన రచనలు చేశారన్నారు. ముఖ్యంగా మహిళా చైతన్యం గురించి అనేక రచనలు, గోల్కొండ ప్రతిక సంపాదకుడిగా సమాజాన్ని చైతన్యం చేశారన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి పయనించిన బాటలో నేటి కవులు, రచయితలు నడవాలన్నారు. గ్రంథ సంపాదకులు డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో పుట్టిన సురవరం ప్రతాపరెడ్డి గొప్ప వ్యక్తి అని, ఆనాటి నిజాం కాలంలో తెలుగుభాషను రక్షించడానికి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. పాలమూరు సాహితీ ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని సంస్థ అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ కవులు, రచయితల పక్షాన చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ బాద్మి శివకుమార్, కాంగ్రెస్ నేత ఏపీ మిథున్‌రెడ్డి, కవులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, భీంపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలి'



మాట్లాడుతున్న నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరవనిత పుట్టినగడ్డ అయిన జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. చాకలి ఐలమ్మ పేరును జిల్లాకు పెట్టడంతో ఉద్యమకారులను గౌరవించినట్లు అవుతుందని తెలిపారు. నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శివన్న మాట్లాడుతూ.. జనగామకు ఐలమ్మ పేరు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచించాలన్నారు. రజకుల ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడమని హెచ్చరించారు. రజకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు రాజు, నాయకులు పెంటయ్య, సతీష్, బాలకృష్ణ, మైబు, చంద్రయ్య పాల్గొన్నారు.

ధాన్యం లారీ బోల్తా



నవాబుపేట: మండలంలోని కొత్తపల్లి సమీపంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తరలిస్తున్న లారీ మంగళవారం బోల్తా పడింది. ధాన్యం లోడు చేసే సమయంలో సరిగ్గా చేయకపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ క్లినర్ తప్పించుకోగా ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అనంతరం లారీ యజమానులు మరో వాహనంలో ధాన్యం లోడ్ మిల్లుకు తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

మహమ్మదాబాద్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ జనార్ధన్‌గౌడ్ తెలిపారు ఆయన కథనం మేరకు.. మండలంలోని ఓ తండాకు చెందిన సుమిత్ మంగళవారం అన్నారెడ్డిపల్లి, మరికొన్ని తండాల్లో 6 క్వింటాళ్ల బియ్యం సేకరించి బొలెరో వాహనంలో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా బియ్యం పట్టుబడ్డాయి. వెంటనే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డీటీ ఆదిత్య వచ్చి పరిశీలించారు. సుమిత్‌ను అదుపులోకి తీసుకొని వాహనాన్ని ఠాణాకు తరలించి కేసునమోదు చేసినట్టు తెలిపారు.

తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

పాలమూరు: రుతుక్రమ సమయంలో సులభంగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని, ఆ సమయంలో వచ్చే నొప్పి నుంచి ఉపశమనం కోసం వివిధ రకాల వ్యాయామాలు చేయాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి గైనిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. సరిత, డా. అర్చన, ఎస్‌పీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బింధు తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రుతుక్రమంపై నిర్వహించిన ప్రత్యేక సదస్సులో వారు పాల్గొని రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎకో ఫ్రెండ్లీ ప్యాడ్స్ మాత్రమే వాడాలని, రోజుకు రెండుసార్లు లోదుస్తులు మార్చుకోవాలని సూచించారు. ఆ దుస్తులను శుభ్రంగా ఉతికి సూర్యకాంతిలో ఆరబెట్టడంతో క్రిములు నశిస్తాయని తెలిపారు. వాడిన ప్యాడ్స్‌ను జాగ్రత్తగా పేపర్లో చుట్టి చెత్తబుట్టలో వేసి చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు శిరీష, దుర్గ, ఈసిన్, శ్వేత, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, అల్పినా, జ్యోతి, లీల, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు నాలా వద్ద సర్వే

బాలానగర్: మండల కేంద్రంలోని 118 సర్వే నంబరులో పెద్ద చెరువు నాలాను మంగళవారం ఏడీ మైనింగ్ హైదరాబాద్, ఏడీ మైనింగ్ మహబూబ్‌నగర్, ఇరిగేషన్ ఈఈ జడ్చర్ల, ఏడీ సర్వేయర్ మహబూబ్‌నగర్ తదితరుల ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా నాలా పూర్వపు తీరు.. ప్రస్తుత డైవర్షన్‌పై ఆరా తీశారు. అనంతరం స్థానిక రైతుల సమక్షంలోనే పంచనామా నిర్వహించి నివేదిక రూపొందించి ఉన్నత అధికారులు పంపించనున్నట్లు వివరించారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌ఐ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్ నుంచి ఇద్దరు బాలికల పరారీ

- పోలీసులకు ఫిర్యాదు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాకేంద్రంలోని బాలసదన్ నుంచి ఈ నెల 26న అర్ధరాత్రి అడ్డాకులకు చెందిన 17 ఏళ్ల మానస, జడ్చర్లకు చెందిన 15 ఏళ్ల అక్షిత పరారయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు బాలసదన్ ప్రహరీ కూలిపోవడంతో అక్కడ నుంచి తప్పించుకుపోయారు. మానస రెండునెలలుగా ఆశ్రమం పొందుతుండగా.. అక్షిత ఈ నెల 15నే చేరింది. మరుసటిరోజు తెల్లవారుజామున వాచ్‌మెన్ వార్డెన్ వరలక్ష్మికి సమాచారం ఇవ్వగా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సెమీస్‌లో పాలమూరు బోల్తా

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ అంతర్ జిల్లా టీ–20 క్రికెట్ లీగ్‌లో వరుస విజయాలతో ఊపు మీద ఉన్న పాలమూరు జట్టు సెమీస్‌లో బోల్తా పడింది. కరీంనగర్ జట్టుతో జరిగి సెమీఫైనల్ మ్యాచ్ చివరి బంతివరకు ఉత్కంఠగా సాగింది. చివరికి నాలుగు పరుగుల తేడాతో మహబూబ్‌నగర్ ఓటమి చవిచూసింది. మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 148 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 20 ఓవర్లలో 144 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రాఫే (30), హర్షవర్ధన్ (26), గణేష్(25) రాణించారు.

ప్రారంభం సరే.. పక్కా భవనమేది?

- తాత్కాలిక భవనంలో అసౌకర్యాలు..
- గండేడ్ కేజీబీవీలో విద్యార్థులకు తప్పనిపాట్లు

గండేడ్: పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేజీబీవీ పాఠశాలలను సమస్యలు వీడడం లేదు. వాటిని ప్రారంభించడంలో చూపిన శ్రద్ధ వసతుల కల్పనలో చూపకపోవడంతో లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి అవరోధం కలుగుతుంది. కొత్తగా పాఠశాల వచ్చిందన్న ఆనందం ఉన్నా వసతుల లేమి వెంటాడుతుంది. ఇందుకు నిదర్శనం.. గండేడ్ కేజీబీవీ పాఠశాల ఏర్పాటునే పేర్కొనవచ్చు. మండలానికి కొత్తగా గతేడాది కేజీబీవీ పాఠశాల మంజూరైంది. గతంలో గండేడ్, మహమ్మదాబాద్ మండలాలు కలిసి ఒకే మండలంగా ఉండడం మూలంగా 2005లో మహమ్మదాబాద్‌లో కేజీబీవీని ఏర్పాటు చేశారు. ఉమ్మడి మండలాల్లోని విద్యార్థులంతా అదే పాఠశాలలో చదువుకునేవారు. అయితే 2020 అక్టోబర్‌లో గండేడ్ మండలం నుంచి మహమ్మదాబాద్ వేర్పడి కొత్త మండలంగా ఆవిర్భవించింది. దీంతో గతేడాది గండేడ్‌కు కొత్తగా కేజీబీవీ పాఠశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో స్థానికులు సంతోషించారు.

ఆశలు అడియాసలయ్యాయి..

తమ పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుందని భావించిన తల్లిదండ్రుల ఆశలు అడియాసలే అయ్యాయి. గతేడాది నవంబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ మధ్యాహ్నం 12 గంటలకు వస్తుందనగా ఆఘమేఘాల మీద మండల కేంద్రంలోని అతిథి గృహంలో దీనిని అప్పటి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. దీంతో ఎట్టకేలకు పాఠశాల ప్రారంభం అవుతుందని అందరూ భావించారు. ఈమేరకు ఆరో తరగతికి గండేడ్‌కు కొత్తగా అడ్మిషన్లు కూడా తీసుకున్నారు. మహమ్మదాబాద్‌కు వేరుగా గండేడ్‌కు వేరుగా కొత్తగా విద్యార్థులను చేర్చుకున్నారు. కానీ అనుమతులు రాలేదని నిలిపివేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకం కూడా కాకపోవడంతో పాఠశాల ప్రారంభం కాలేదు. దీంతో గండేడ్ పేర చేరిన విద్యార్థులను తిప్పి పంపలేక మహమ్మదాబాద్ లోనే విద్యార్థులు చదివించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో అక్కడే ఉంచారు. రెండు మండలాల విద్యార్థులు ఒకే చోట కావడంతో అప్పట్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. అదే సమయంలో ఎన్నికలు రావడంతో అది మరుగునపడింది. ఎన్నికల తర్వాత ప్రారంభం అవుతుందనుకుంటే అది సాధ్యం కాలేదు. అయితే ఈ ఏడాది ఖచ్చితంగా గండేడ్‌లో పాఠశాల ప్రారంభించాలని అధికారులు చెప్పడంతో దీని ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు.



గండేడ్ కేజీబీవీ పాఠశాల కొనసాగేది ఇందులోనే..

పక్కా భవనం కరువు..

గండేడ్ కేజీబీవీకి పక్కా భవనం లేదు. తాత్కాలికంగా మండల కేంద్రంలో అతిథి గృహం భవనంలో కేజీబీవీని కొనసాగించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా విద్యాధికారి రవీందర్ ఆదేశాల మేరకు ఎస్‌ఓ లక్ష్మీబాయి, ఎంపీడీఓ దేవన్న, మండల స్పెషల్ ఆఫీసర్ పాండు, స్థానికులతో కలిసి శనివారం పాఠశాల ప్రారంభించే అతిథి గృహంలో వసతులు పరిశీలించారు. ఇక్కడ మాత్రం ఎలాంటి వసతులు లేవు. మూడు గదులు, వరండా తప్ప పూర్తిస్థాయి సౌకర్యాలేమి లేవు. వంట గదులు, డైనింగ్ హాల్ ఇతర ఏవీ లేకపోవడంతో అక్కడ పాఠశాల నిర్వహించడం కష్టంగా ఉంది.

ప్రతిపాదనలు పంపుతాం..



గండేడ్‌లో కేజీబీవీ నిర్మాణానికి స్థలం కావాలని రెండు నెలల క్రితమే కలెక్టర్‌కు నివేదించాం. స్థలం కేటాయిస్తే వెంటనే నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతాం. అంతవరకు తాత్కాలికంగా ప్రస్తుతం ఉన్న అతిథిగృహంలో కొనసాగిస్తాం. టాయిలెట్లు, కిచెన్ షెడ్ ఏర్పాటు చేయించేలా చూస్తాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

కలెక్టర్‌కు నివేదించాం



కలెక్టర్ నుంచి కేజీబీవీ పాఠశాల నిర్మాణానికి స్థలం కావాలని కోరారు. దీంతో మండల కేంద్రంలో 313 సర్వే నంబరులో 3 ఎకరాలు స్థలం ఇస్తామని నివేదిక కలెక్టరు పంపించాం. దీనికి సంబంధించిన మ్యాపు జత చేశాం. కలెక్టరు అనుమతులు రాగానే స్థలం అప్పగిస్తాం.

– నాగలక్ష్మి, తహసీల్దార్, గండేడ్